# ఓ వైపు చేరికలు.. మరోవైపు ఏకగ్రీవ తీర్మానాలు



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జీడిమెట్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంపత్‌గౌడ్, పక్కన పార్టీ సీనియర్ నేత కేఎం గౌరీశ్, సంపత్‌మాధవరెడ్డి, సిద్దిరాములు

## కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు పెరుగుతున్న మద్దతు

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 19 : సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గడిచిన తొమ్మిదిన్నర ఏండ్ల కాలంలో ఆరున్నర వేల కోట్ల బడ్జెట్‌తో అంచెలంచెలుగా అభివృద్ధి చేశామని, ఈ ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఇంతటి అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించి.. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గురువారం నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 132 జీడిమెట్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూదుల సంపత్ గౌడ్ తన అనుచరులు సుమారు 150 మందితో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సుభాష్‌నగర్ డివిజన్‌కు చెందిన టీడీపీ మాజీ మున్సిపల్ అధ్యక్షుడు, సీనియర్ నేత బలరాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సతీశ్ గౌడ్, టీడీపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి దుర్గారావు తన అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు. రాజస్థాన్ రాష్ట్ర మాలి సమాజం ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, గాజులరామారం డివిజన్ శ్రీకృష్ణనగర్, భవానీ అసోషియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు మద్దతుగా ఏకగ్రీవంగా తీర్మానం చేసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్, సంపత్‌మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, సుధాకర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, గుమ్మడి మధుసూదన్‌రాజ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్

### బీఆర్ఎస్ శ్రేణుల్లో పెరిగిన జోష్

మేడ్చల్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): మేడ్చల్‌లో ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. అంచనాలకు మించి గులాబీ దండు కదలి రావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. మేడ్చల్ నియోజకవర్గం ప్రజలు చైతన్యవంతులని, తొమ్మిదిన్నర ఎండలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి ఓటు వేయాలని సూచించడంతో కండ్లముందు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనబడుతుందని, రానున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు సీఎం కేసీఆర్‌కే తెలుపుతామని ప్రజలు ప్రకటిస్తున్నారు. సభను విజయవంతం చేసిన నియోజకవర్గం ప్రజలకు మంత్రి మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## సేవ చేసేందుకు వచ్చా.. ఆశీర్వదించండి

### మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి



నేరేడ్‌మెట్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్‌మెట్, అక్టోబర్ 19 : మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, సేవ చేసేందుకు ముందుకు వచ్చానని ఆశీర్వదించి.., అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రజలను కోరారు. గురువారం నేరేడ్‌మెట్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో పేదలకు సంబంధించిన అనేక పథకాలను ప్రకటించారని, ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదన్నారు. ఓట్లు అడగడానికి వస్తున్న వారు ఏం చేస్తారో చెప్పకుండా.. కులం, మతం పేరుతో రాజకీయాలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. నాయకులు ఉపేందర్ రెడ్డి, దార శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ రెడ్డి, శర్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్ రాకుండా చేద్దాం

- బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని గెలిపించుకుందాం
- ఉప్పల్ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

కాప్రా, అక్టోబర్ 19 : ఉప్పల్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్ రాకుండా చేద్దామనీ, బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఉప్పల్ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం సైనిక్‌పురిలో ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కార్యాలయానికి భారీ సంఖ్యలో తన అనుచరులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలిరాగా బండారి లక్ష్మారెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఉప్పల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాగిడి మాట్లాడుతూ తాను ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పార్టీకి సేవ చేశాననీ, రూ.కోట్లు ఖర్చు చేసుకున్నానని, కానీ ఆ పార్టీ తనను మోసగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లతరబడి నమ్ముకున్న పార్టీ మోసం చేస్తే సీఎం కేసీఆర్ తనను పెద్ద మనసుతో ఆదరించారని అన్నారు. తనకు సోదరుడు లాంటి బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విజయం కోసం ఇంటింటికీ తిరిగి భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ రాకుండా చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రతి డివిజన్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతారని, కాంగ్రెస్ పార్టీ చేసే మోసాన్ని వారు గ్రహించారని తెలిపారు. ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో అందరం సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఉప్పల్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌లో జరుగుతున్న కుల రాజకీయాలు, డబ్బు రాజకీయాలు, మోసం చేసే నైజం నచ్చక ఆ పార్టీ నేతలు ఆవేదన చెందారని అన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్, రాష్ట్ర బీఆర్ఎస్ కార్యదర్శి తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, ఉప్పల్ బీఆర్ఎస్ మైనారిటీ నేత ఎంకే బద్రుద్దీన్, నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కు సత్యానగర్‌లో హారతి ఇచ్చి జేజేలు పలుకుతున్న బస్తీ మహిళలు

## అభివృద్ధి ఆగొద్దంటే.. మరోసారి గెలిపించండి

### అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 19 : అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి ఆగొద్దంటే మళ్లీ గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నల్లకుంట డివిజన్ సత్యానగర్, రత్నానగర్, శివానందనగర్‌లలో పాదయాత్ర చేస్తూ ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ.. తనకు ఓటువేయాలని కోరారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో ఇప్పటికే చాలా అభివృద్ధి జరిగిందని, ఇంకా చేయాల్సింది ఉందన్నారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

### ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నేతలు



ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నేతలు

కవాడిగూడ, అక్టోబర్ 19 : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు ప్రజలను మభ్యపెడుతూ ఎన్నికల్లో గెలువాలనే తపనతో ఆచరణకు అమలు కాని హామీలు ఇస్తున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం రాత్రి భోలక్‌పూర్‌లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో రంగానగర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రముఖ సంఘ సేవకుడు నజీర్, సద్దాంతో పాటు కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన దాదాపు 100 మంది నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ గులాబీ కాండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేండ్లలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక జటిలమైన సమస్యలను పరిష్కరించడంతో పాటు కలుషిత నీటి సమస్యను పరిష్కరించామని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జయసింహ, పార్టీ సీనియర్ నాయకుడు రెబ్బ రామారావు, మైనారిటీ రాష్ట్ర నాయకుడు షరీపోద్దిన్, జునేద్ బాగ్దాది, డివిజన్ ఉపాధ్యక్షుడు ఎ.శంకర్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్ ముదిరాజ్, పబ్బ కృష్ణ, ఆర్.శ్రీనివాస్, మున్వర్ చాంద్, మక్బూల్, జబ్బార్, ఆరీపోద్దిన్, పాల్గొన్నారు.

## ఎల్బీ నగర్‌లో బీజేపీకి షాక్..

ఎల్బీనగర్, అక్టోబర్ 18 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. బీజేపీ రాష్ట్ర స్లమ్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్, సీనియర్ నాయకుడు పసుపుల హరిబాబు పార్టీకి రాజీనామా చేశారు. చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తమ ప్రాంతంలో చేసిన అభివృద్ధి పనులు కూడా పార్టీ మారడానికి కారణమన్నారు. సుధీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, చైతన్యపురి డివిజన్ మాజీ అధ్యక్షుడు పవన్, సోంటి చంద్రశేఖర్‌రెడ్డి, గండి సన్ని యాదవ్, దుబ్బాక శశిధర్‌రెడ్డి, వీరన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ రాష్ట్ర స్లబ్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ పసుపుల హరిబాబు